## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: రోడ్డు పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్య భార్గవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాజులరామారం, 11కేవీ మహాదేవపురం, 11కేవ క్రషర్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉషోదయకాలనీ ఫేజ్-ఏ, చిత్తారమ్మ ఆలయ ఎదురు గల్లీ, గాజులరామారం ప్రధాన రోడ్డు, వెంకటేశ్వర గార్డెన్స్, మహారాజా గార్డెన్స్ వెనుక గల్లీలు, గాజులరామారం చౌరస్తా ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**11కేవీ దుర్గా ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో..**

కుత్బుల్లాపూర్: ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ దుర్గా ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దుర్గా ఎస్టేట్స్ వెన్నెలగడ్డ, బౌద్ధనగర్, వసుధ అపార్ట్‌మెంట్స్, రాఘవేంద్రకాలనీ, అదేవిధంగా 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు జీడిమెట్ల గ్రామం, గ్రీన్‌పార్కు, భీమా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, పిస్తాహౌస్ లేన్, మెడోస్ ఆస్పత్రి, జీడిమెట్ల గ్రామం ప్రధాన రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## బస్సులో మంటలు

సుభాష్‌నగర్: మరమ్మతుల కోసం వర్క్‌షాప్‌కు వచ్చిన బస్సు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయ్యింది. సూరారం ప్రధాన రోడ్డును ఆనుకొని కట్టమైసమ్మ ఆలయం సమీపంలోని ఎస్.ఎస్ బస్‌బాడీ కంపెనీకి నూతన బస్సును అదనపు మరమ్మతుల కోసం ఆదివారం తీసుకువచ్చారు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీనికితోడుగా పక్కనే చెట్ల కొమ్మలకు మంటలు వ్యాపించడంతో ఉవ్వెత్తిన ఎగిసి పడ్డాయి. స్థానికుల సమాచారంతో జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది.

## మహాశివరాత్రికి ఆలయం ముస్తాబు

సుభాష్‌నగర్: సూరారంలోని ఉమామహేశ్వర ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. సోమవారం నుంచే ఈ ఆలయంలో పూజలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఉమామహేశ్వరుడి కల్యాణ జరగనున్నది. ఈ సందర్భంగా 108 కలశాలతో స్వామివారికి అభిషేకం, శంకు పూజ నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ తెలిపారు. 30 ఏళ్లుగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## మేనమామపై అల్లుడి దాడి

జగద్గిరిగుట్ట: మేనమామపై అల్లుడు దాడి చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లి సీతాపతికాలనీకి చెందిన గుడి భూపాల్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. కాగా గాజులరామారం ప్రాంతానికి చెందిన తన మేనల్లుడు చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి గతంలో ప్రింటింగ్ బిజినెస్ చేశాడు. లావాదేవీల్లో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తడంతో విడిపోయారు. భూపాల్‌రెడ్డికి బాకీ ఉండగా అతని తల్లి, అక్క వెళ్లడంతో చంద్రశేఖర్‌రెడ్డి చెక్కులు ఇచ్చాడు. అదే సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి భూపాల్‌రెడ్డి గురించి తన భార్యకు చెడుగా చెప్పాడు. దీంతో ఆదివారం ఈ విషయం మాట్లాడేందుకు భూపాల్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దగ్గరికి వెళ్లాడు. అదే సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా షాపులో ఉన్న కొబ్బరి కాయతో భూపాల్‌రెడ్డిపై దాడి చేశాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా కాశీ విశ్వేశ్వరుడి ప్రతిష్ఠాపన

గాజులరామారం: లెనిన్‌నగర్‌లో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.

## రేపటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో ఈనెల 25 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పి. నాగిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, రుద్ర హోమం, 26న మహాశివరాత్రి రోజు తెల్లవారుజామున 4.30 నుంచి కాశీ విశ్వేశ్వర స్వామికి సామూహిక సంతధార అభిషేకాలు, ఉదయం 10 గంటలకు రుద్రహోమం, అర్చనలు, రాత్రి 9.30 గంటలకు కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, 27న నిత్యాభిషేకాలు, రుద్ర హోమం ఉంటుందని తెలిపారు.

# కాలనీలు చీకటిమయం!

### నిజాంపేట్ కార్పొరేషన్‌లో వెలగని వీధిలైట్లు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ● ఇబ్బందుల్లో స్థానికులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చిమ్మచీకట్లు అలుముకున్నాయి. అనేక డివిజన్లలో సుమారు నెల రోజుల నుంచి వీధిలైట్లు వెలగకపోవడంతో కాలనీలు అంధకారంలోనే ఉంటున్నాయి. దీంతో రాత్రుల్లో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ జనవరి చివరివారంలో మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి అధికారులు, కిందిస్థాయి సిబ్బంది ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదిత్యాగార్డెన్స్ కాలనీ సిద్ధిబ్లాక్ రోడ్డులో, సాయినగర్ ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లోని పలురోడ్లు అదేవిధంగా సాయినగర్ నుంచి నిజాంపేట్ వెళ్లేరోడ్డులో శ్మశాన వాటిక పక్కన ఉన్న రోడ్లపై సైతం వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా సాయినగర్ కమ్యూనిటీ హాల్ వెనుక వైపు ఉన్న రోడ్లపై ఇలా కాలనీలోని అనేక రోడ్లపై ఉన్న స్ట్రీట్ లైట్లు నెల రోజులుగా వెలగకపోవడంతో దొంగతనాలు సైతం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు.

**కొత్త లైట్లు అమర్చడంలో నిరక్ష్యం..**

పాడైన వీధిలైట్లను తొలగించి కొత్తవి అమర్చాల్సిన మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. పలుమార్లు ఫిర్యాదు చేస్తే వచ్చి పాడైన లైట్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేసి వెళ్తున్నారని అవి కూడా సరిగ్గా వెలగడం లేదని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బిల్లులు చెల్లించకపోవడమే కారణమా..?**

మున్సిపల్ కార్పొరేషన్‌కు వీధిలైట్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించడంలో ఆలస్యం చేస్తుండటంతోనే వారు లైట్లు సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. అయితే ఈ విషయమై ‘సాక్షి’ సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులను వివరణ కోరేందుకు ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. ఏది ఏమైనా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాడైన చోట్ల కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సాయినగర్ కమ్యూనిటీ హాల్ వెనుక వైపు రోడ్డులో..


సాయినగర్ ప్రభుత్వ పాఠశాల పక్కన రోడ్డులో..


జేకేఎం కాలనీలో వెలగని లైట్..

# పాఠ్యపుస్తకాల్లో రాజ్యాంగాన్ని చేర్చాలి

దుండిగల్: ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల్లో భారత రాజ్యాంగాన్ని తప్పనిసరిగా చేర్చాలని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ, ప్రజా సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు ప్రత్యేక పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిత్య పూలమాల కార్యక్రమం 300 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మార్చి 1న సూరారంలోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ భవన్ వద్ద భారత రాజ్యాంగ పరిరక్షణ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ పలువురు నేతలు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు అవిజే జేమ్స్, అశోక్, అమర్ బాబు, ఐలయ్య, జీజే రత్నం, యాదగిరి తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

## సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ న్యూమాణిక్యనగర్‌లో ఆదివారం పర్యటించారు. డ్రైనేజీ, రోడ్లు, శానిటేషన్, ఎలక్ట్రికల్ పోల్స్ తదితర సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధికారులు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీ అధ్యక్షుడు గోపీ కృష్ణమాచార్యులు, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, శంకరాచారి తదితరులు ఉన్నారు.


న్యూ మాణిక్యనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

# రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

నిజాంపేట్: ప్రజలందరికీ రాజ్యాంగంపై అవగాహన ఉండాలని బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమ్మెట భూపాల్ అన్నారు. బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో పలువురికి భారత రాజ్యాంగం పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే రాజ్యాంగంపై క్రమపద్ధతిలో అవగాహన కల్పించేందుకు మరిన్ని పాఠ్యాంశాలను పుస్తకాల్లో చేర్చాలన్నారు. బహుజనుల రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాసమాజ స్థాపన జరుగుతుందని అభిప్రాయపడ్డారు.అంబేడ్కర్ ఆశయాలను రాజ్యాంగం రూపంలో ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే తాను ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.


రాజ్యాంగం పుస్తకాన్ని అందజేస్తున్న భూపాల్

# ఎమ్మెల్యేను కలిసిన అసోసియేషన్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ రాంనరేశ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభ్యులు కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతుల రాజేందర్, అంబాదాసు, కార్యవర్గ సభ్యులు చాట్ల రవి అచ్చగారి రాజిరెడ్డి, సత్యనారాయణ చెట్టి, చంద్రయ్య, సురేశ్ నక్క, ఎం. రాజిరెడ్డి, ఉమామహేశ్వర్‌రావు, బ్రహ్మయ్య, నాగర్జున రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో సభ్యులు

# వాల్మీకి మహర్షి విగ్రహం ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ జన్మభూమికాలనీలో శ్రీ వాల్మీకి బోయ కిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాల్మీకి సంస్కృత సాహిత్యంలో పేరెన్నికగల కవి అని, రామాయణాన్ని రచించారని, ఆయన్ని సంస్కృత భాషకు ఆదికవిగా గుర్తిస్తారన్నారు. ఆయన జీవితం ఎంతోమందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో రామగుండం కార్పొరేటర్ అడ్డాల స్వామి, వాల్మీకి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రేపల్లె కృష్ణ వాల్మీకి, ప్రధాన కార్యదర్శి జ్యోతి, బోయ నగేశ్, బోయ తిమ్మప్ప, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పశువుల సంత ప్రాంతంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలి

మోతీనగర్: బబ్బుగూడలోని పశువుల సంత ప్రాంతంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మైదానం నిర్మాణం విషయమై 15 రోజులుగా సంతకాల సేకరణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా అవంతినగర్ తోట ముఖ ద్వారం వద్ద ఆదివారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. పశువుల సంత వారానికి 2 రోజులు మాత్రమే ఉంటుందని, మిగిలిన రోజుల్లో బహిరంగ ప్రదేశం కావడంతో మందుబాబులకు అడ్డాగా మారడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోందన్నారు. గత ప్రభుత్వం ఈ స్థలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని శంకుస్థాపన చేసినప్పటికీ అనివార్య కారణాలతో నిర్మించలేకపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కడపన గోపాల్‌రెడ్డి, సీహెచ్. సత్యనారాయణ, గార్లపాటి మోహన్‌రెడ్డి, జి. వెంకటేశ్వర్లు, కండోజర్‌రావు, బాల్ రంగప్ప, జి. వెంకటేశ్వర్లు, భీమ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.


సంతకాల సేకరణలో అఖిలపక్ష నాయకులు

# ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కుత్బుల్లాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇందిరానగర్‌లోని శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో త్రయన్విక ప్రతిష్ఠాపనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా ధ్వజస్తంభం, నవగ్రహాలు, శ్రీగణపతి, శ్రీపార్వతీదేవి అమ్మవారి విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. అనంతరం నిర్వహించిన యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో గొరిశెట్టి శివఈశ్వర్‌రావు, రాజ్‌గోపాల్ రెడ్డి, దత్తాత్రేయ, బుచ్చిరెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం..**

గాజులరామారం బాలయ్యనగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఒగ్గు కళాకారుల సంగీత వాయిద్యాల మధ్య అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బాలయ్యనగర్ ప్రెసిడెంట్ నగేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్, గంగారామ్, ప్రేమ్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.


రేణుకా ఎల్లమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

## ప్రత్యేక పూజలు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శివలింగ ప్రతిష్ఠాపనలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ, గోపాల్ రెడ్డి, కుంటి నాగరాజు, సుధాకర్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్, నల్తూరి కృష్ణ గారు, శ్రీనివాస్ గౌడ్, అర్కల జీతయ్య పాల్గొన్నారు.

## నియామకం

జగద్గిరిగుట్ట: ఆల్ ఇండియా రాష్ట్ర దళిత్ సేనా ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షుడిగా జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌కు చెందిన ఐలయ్యగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జేబీ రాజు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, బీసీ జనాభా రిజర్వేషన్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆయనను ఐఎస్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శీనుతో పాటు పలు దళిత సంఘాల నేతలు అభినందించారు.


గౌడ ఐలయ్యగౌడ్

## ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై కేసు

కుత్బుల్లాపూర్: అనుమతుల్లేకుండా హుక్కా, మద్యం విక్రయిస్తున్న ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో అయోధ్యనగర్ చౌరస్తాలోని ఫామ్ స్టే ఫామ్ హౌస్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడి చేసి పలువురు హుక్కా, మద్యం సేవిస్తుండగా పట్టుకున్నారు. రెండు హుక్కా పాట్స్, 10 మద్యం సీసాలను సీజ్ చేసి ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

# బాలానగర్‌లో జాతీయ జెండావిష్కరణ


జాతీయ పతాకావిష్కరణలో బండి రమేశ్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు

బాలానగర్: బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎప్పుడూ పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు లాల్జీ దేశాయ్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ హాజరై మాట్లాడుతూ.. ప్రతినెలా చివరి ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరణ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి సేవాదల్ పార్టీ వాజీద్ పాషా, అంజాద్, టెంపుల్ కమిటీ మెంబర్లు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్థానికుల సహకారంతో సేవా కార్యక్రమాలు

మోతీనగర్: స్థానికుల సహాయ సహకారాలతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిలింగ్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఫోరంకు జయంతి లక్ష్మీ నారాయణ పలు ఆధ్యాత్మిక పుస్తకాలను, అదేవిధంగా అన్నపూర్ణ దంపతులు బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయో వృద్ధుల కోసం తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి, భుజముల నాగేశ్వరరావు, సభ్యులు బ్రహ్మానంద రెడ్డి, మహమూద్ అలీ, కొల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేస్తున్న దాతలు


## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మోతీనగర్: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ న్యూ రామారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా గెలుపొందిన రాంరెడ్డి ప్రమాణ స్వీకారం స్థానిక కమిటీ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయాల్లో అభివృద్ధికి పాటుపడాలన్నారు.


ప్రమాణ స్వీకారంలో కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

## నాడు ఆహ్లాదం / నేడు అధ్వానం

**అంబీర్ చెరువుకు పునర్వైభవం వచ్చేనా..?**


గతంలో వర్షం నీటితో కళకళలాడుతున్న అంబీర్ చెరువు


ప్రస్తుతం కలుషితంగా మారిన అంబీర్ చెరువు

ఒకప్పుడు వర్షం నీటితో కళకళలాడిన అంబీర్ చెరువు.. ప్రస్తుతం మురుగునీటితో కలుషితమైపోయింది. చెరువులను కాపాడి భవిష్యత్తు తరాలకు నీటి వనరులు అందించాల్సిన పాలకులు సైతం పట్టించుకోకపోవడంతో వాటి ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. కేవలం ఎన్నికల సమయంలోనే చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడమే తప్ప తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంబీర్ చెరువుకు పునర్వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

–నిజాంపేట్